విద్యాభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ పనులు, బిల్లుల విడుదలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 3 ప్రజాజ్యోతి: జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం చేపట్టిన నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా నిర్దీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన చోట పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకోవడంతో పాటు అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

బుధవారం | 4 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 10



కరువుపై రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలి

- సూపర్ ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి
- యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి
- రైతులు ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మవద్దు : ప్రభుత్వ విప్ విజయరమణారావు

పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 3 ప్రజాజ్యోతి: వాతావరణ పరిస్థితులు, సూపర్ ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు.భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో యాసంగి సీజన్ లో అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే మొక్కజొన్న, శెనగ వంటి ఆరుతడి పంటలను ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, చీకురాయి గ్రామాలతో పాటు పెద్దపల్లి పట్టణ వ్యవసాయ మార్కెట్, చందపల్లిలో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం స్థానిక నాయకులతో

మిగతా 2 లో...

ఐదు రకాల పంటలు సాగు చేస్తూ..
ఆదర్శంగా నిలుస్తూ..

- మానాలలో నీటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలు సాగు చేస్తున్న రైతు తూము గంగాధర్
- పరిశీలించి.. అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



వేములవాడ,నవంబర్,3:ప్రజాజ్యోతి రుద్రంగి మండలం మానాలలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ..ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు రైతుతూము గంగాధర్. విభిన్న రకాల పంటలు వేసి.. మంచి ఆదాయం వచ్చేలా ముందుకు సాగుతున్నారు ఆ రైతు. క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించి రైతును అభినందించారు.రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన తూమ్ గంగాధర్ తన ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ..ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు. పసుపు 20 గుంటలు, వెల్లుల్లి 10 గుంటలు, ఉల్లిగడ్డ 10 గుంటలు, మిర్చి 10 గుంటలు, కొత్తిమీర 10 గుంటల్లో సాగు చేస్తున్నారు. ఉన్న నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ.. ఆయా పంటలు సాగు చేస్తున్నారు.

ఎక్కడ విక్రయిస్తారు..?

ఐదు రకాల పంటలు సాగు చేస్తున్నారు రైతుతూము గంగాధర్ వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పసుపు, వెల్లుల్లి ఇతర పంటలను పరిశీలించి.. పంట ఎన్ని రోజులకు

మిగతా 2 లో...

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

- 2.2 కిలోల గంజాయి,సెల్‌ఫోన్లు స్వాధీనం

కరీంనగర్ క్రైం, నవంబర్ 03 (ప్రజాజ్యోతి): గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కొత్తపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.వారి వద్ద నుంచి 2.2 కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం..కరీంనగర్‌లోని రేకుర్తికి చెందిన మహమ్మద్ మున్నా, మహమ్మద్ షారుక్ గత కొంతకాలంగా మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చేవారు. చిన్నచిన్న ప్యాకెట్లుగా

మిగతా 2 లో...



గ్రామ పంచాయతీ భవనానికి గ్రహణం ?

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని నిర్మాణం,
- శిథిలావస్థకు చేరిన పాత పంచాయతీ భవనం,
- కొత్త ప్రభుత్వంపైనే గ్రామస్థుల ఆశలు

ఎండపల్లి, నవంబరు 3 ,ప్రజాజ్యోతి గ్రామ పాలనకు కేంద్రంగా ఉండాల్సిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి గ్రహణం పట్టింది. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో గుల్లకోట గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు పాత పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో కార్యాలయ నిర్వహణ ఇబ్బందిగా మారింది. గతంలో ప్రారంభించిన నూతన భవన నిర్మాణం

మిగతా 2 లో...



విద్యాభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి...)

తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులతో పాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇతర నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించిన కలెక్టర్, పెండింగ్ లో ఉన్న బిల్లుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం స్విమ్మింగ్ పూల్ నిర్మాణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, పనుల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో జాప్యానికి తావులేకుండా మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డిప్యూటీ ఈఈ రామకృష్ణ, సాంకేతిక అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదు రకాల పంటలు సాగు చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..



(మొదటి పేజీ తరువాయి...)

కోతకు వస్తుంది? ఎంత దిగుబడి వస్తుంది? ఎక్కడ విక్రయిస్తారు? ఎంత ఆదాయం వస్తుందో ఆరా తీశారు. పసుపు స్థానిక లేదా కోరుట్ల, మెట్ పల్లి, నిజామాబాద్ కేంద్రాలకు తరలించి అమ్ముతామని రైతు చెప్పారు. మిగతా పంటలకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కరువుపై రైతులు ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలి

(మొదటి పేజీ తరువాయి...)

కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ ప్రకృతి పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకొని పంటల సాగులో తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకోకుండా వరి సాగు చేస్తే భవిష్యత్తులో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్కువ నీటితో సమృద్ధిగా పండే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు రెండు రోజుల్లోనే వారి ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రతిపక్షాల ఆరోపణలను నమ్మి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని, తేమ శాతం, తూకం, ఇతర అంశాల పేరుతో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని అధికారులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని సజావుగా కొనుగోలు చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనానికి గ్రహణం ?

(మొదటి పేజీ తరువాయి...)

మధ్యలోనే నిలిచిపోవడం తో అయోమయ పరిస్థితి నెలకొంది.

మారుతున్న పాలకులు.. మారని పరిస్థితి..

గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే పనులు పూర్తికాకపోవడంతో భవనం అసంపూర్తిగానే మిగిలిపోయింది. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా నిర్మాణ పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు. గ్రామ పరిపాలనకు అవసరమైన కార్యాలయ భవనమే అందుబాటులోకి రాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పాత భవనం శిథిలావస్థలో..

నూతన భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో పాత పంచాయతీ భవనంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఆ భవనం సైతం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామసభలు, సమావేశాలు, ప్రజలకు అవసరమైన వివిధ సేవల నిర్వహణకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనైనా తమ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మోక్షం లభిస్తుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో నైనా మిగిలిన పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం గుల్లకోట సమస్యపైనా దృష్టి సారించాలని అలాగే ఉన్నతాధికారులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అలాగే నూతన పంచాయతీ పాలకవర్గమైనా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు,

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



గుల్లకోట గ్రామ పంచాయతీ భవన అసంపూర్తి నిర్మాణంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. వారి సూచనల మేరకు తదుపరి చర్యలు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

దొండ కృపాకర్, ఎంపీడీవో. ఎండపల్లి,

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి...)

తయారుచేసి విద్యార్థులు, ఇతరులకు అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లి గుర్తుతెలియని వ్యక్తులనుంచి కిలోకు రూ.20 వేల చొప్పున 2.200 కిలోల గంజాయిని కొనుగోలు చేసి రేకుర్తికి తీసుకొచ్చారు. చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసి కిలోకు రూ.50 వేల చొప్పున విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో గంజాయిని చేతి సంచిలో తీసుకుని రేకుర్తిలోని సమ్మక్క గద్దెల సమీపంలో కెనాల్ కాలువ వెంట వెళ్తుండగా, ఎస్సై సాంబమూర్తి సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా, అనుమానంతో వారిని పట్టుకుని తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద ఉన్న సంచిలో గంజాయి బయటపడింది. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి 2.2 కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తపల్లి ఎస్‌హెచ్‌ఓ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై సాంబమూర్తితో పాటు హెడ్ కానిస్టేబుల్ హరికేశవ్, పరశురాములు, కానిస్టేబుళ్లు శ్రీనాథ్, వెంకటేష్, శ్రీనివాస్, శివలను సీఐ అభినందించారు.

వ్యభిచార గట్టు గుట్టు రట్టు అయ్యేనా?

- విటులకు వాట్సప్ ద్వారా వల
- హైదరాబాద్, కరీంనగర్ నుండి యువతుల రవాణా
- వ్యభిచార కుంపట్లో పేద విద్యార్థినులు
- పోలీసుల నిఘా కరువు.... లాడ్జిలపై రైడ్స్ ఏవి?



మల్యాల, నవంబర్ 03, ప్రజా జ్యోతి: మల్యాల మండలంలోని వ్యభిచార గట్టు గుట్టు రట్టు అయ్యేనా? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో రద్దీగా ఉన్న ప్రదేశంలో ఎలాంటి నిఘా లేకపోవడంతో కొందరు కేటుగాళ్లు కొన్ని స్థానిక లాడ్జిలు, రహస్య ప్రాంతాలను అడ్డాగా చేసుకొని ఈ అసాంఘిక కార్యకలాపాలను నిర్భయంగా నిర్వహిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది స్థానికుల అవతారం ఎత్తి వ్యాపారం ముసుగులో ఈ గలీజ్ దందాను నడిపించడంపై స్థానికులు మండిపడుతున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో విటుల జేబులు కొల్లగొడుతూ వారి దందా మూడు పువ్వుల ఆరు కాయలుగా నడుస్తున్నట్లు సమాచారం. ఓపెన్ సీక్రెట్ గా నడుస్తున్న ఈ దందాకు పోలీసులు పులిస్టాప్ పెట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

విటులకు వాట్సప్ ద్వారా వల

ఈ ముఠా సభ్యులు పోలీసుల కళ్ళుగప్పేందుకు టెక్నాలజీని ఆసరాగా చేసుకుంటున్నారు. నేరుగా కార్యకలాపాలు నిర్వహించకుండా, వాట్సప్ గ్రూపులు వ్యక్తిగత చాట్ల ద్వారా విటులను ఆకర్షిస్తున్నట్లు సమాచారం. యువతుల ఫోటోలు, ధరలను పంపిస్తూ రహస్యంగా ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. వీరికి ఒప్పందం కుదురుస్తున్న వ్యక్తులు ఎవరు? ప్రైవేటు రూములు ఎన్ని? అనుమతులు ఉన్న లాడ్జీలు ఎన్ని? అనుమానం వచ్చిన వ్యక్తులను లాడ్జి యజమానులు ఎందుకు ప్రశ్నించడం లేదు? రిజిస్టర్ మెయింటెనెన్స్ ఉందా? బహిరంగ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా? కెమెరాలు ఉంటే అవి పని చేస్తున్నాయా? నియమ నిబంధనలకు తగ్గట్టుగా యజమాన్య పద్ధతులలో వాటిని నడిపిస్తున్నారా? అనే కోణంలో పోలీసులు లాడ్జిలపై రైడ్ నిర్వహించి విచారణ చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అనుమానం వచ్చిన వ్యక్తుల ఫోన్ ట్రాక్ చేయడం వల్ల మరిన్ని ఆధారాలు లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్, కరీంనగర్ నుండి యువతుల రవాణా

ఈ అసాంఘిక కార్యకలాపాల కోసం కేవలం స్థానికంగానే కాకుండా, హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రధాన నగరాల నుండి యువతులను ఇక్కడికి రప్పిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వచ్చిన యువతి రవాణా, భోజనం, లార్జ్ పూర్తి ఖర్చు విటుడే భరించేలా వాట్సాప్ లోనే ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలోని ఆ గ్రామం రద్దీగా ఉన్న ప్రదేశం కావడంతో కాంప్లెక్స్ లు, లాడ్జిలు, ప్రైవేట్ రూమ్ లు అందుబాటులో ఉండడంతో ఈ దందాను సాగించడానికి ఒక అసోసియేషన్ ల ఏర్పడిన కొంతమంది సంబంధిత అధికారులకు తాయిలాలు అందిస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నట్లు వినికిడి.

వ్యభిచార కుంపట్లో పేద విద్యార్థినులు

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పేద విద్యార్థినులు, ఉపాధి కోసం వచ్చే కొందరు యువతులు ఈ వ్యభిచార కూపంలో చిక్కుకుని తమ భవిష్యత్తును పణంగా పెడుతున్నట్లు స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. డబ్బు ఆశ చూపి కొందరు అసాంఘిక శక్తులు వారిని ఈ మార్గంలోకి లాగుతున్నట్లు ఆందోళన వ్యక్తమవుతోంది. మల్యాల ఎక్స్ రోడ్ సమీపంలోని ఓ భోజనశాలలో విటుడు ఓ యువతి భోజనం చేస్తున్న సమయంలో మాట్లాడుకున్న సంభాషణ ఆ భోజనశాలలోని కొంతమంది వ్యక్తులను నివ్వెరపరిచింది.

పోలీసుల నిఘా కరువు.. లాడ్జిలపై రైడ్స్ ఏవి?

మల్యాల ప్రాంతంలోని పలు లాడ్జిలలో ఇల్లీగల్ యాక్టివిటీస్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ, సంబంధిత పోలీసులు ఎలాంటి దాడులు (రైడ్స్) నిర్వహించకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న వసతి గృహాలపై ప్రత్యేక నీఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా, స్థానిక అధికారులు స్పందించి, లాడ్జిలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, ఈ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పిల్లలకు జంక్ ఫుడ్ వద్దు.. అంగన్వాడీల్లో లభించే బలావర్ధక ఆహారమే ముద్దు: మున్సిపల్ చైర్మన్

- అంగన్వాడీ పౌష్టికాహారంతోనే చిన్నారుల శారీరక, మానసిక వికాసం
- రూ. 200 కోట్లతో వేములవాడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం
- తల్లిదండ్రులు ఆరేళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీలకు పంపించాలి
- 23వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు
- కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్థానిక కౌన్సిలర్ బోనాసాగరిక శివ



వేములవాడ,నవంబర్,3:ప్రజాజ్యోతి వేములవాడ పట్టణంలోని 23వ వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా పాల్గొనిమాట్లాడారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక సహాయ సహకారాలు,మార్గదర్శకత్వంలో విద్యా, వైద్య రంగాలు మరియు ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. వేములవాడ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయన కృషితో వార్డులలో అభివృద్ధి పనులు వేగవంతం కావడమే కాకుండా, రాబోయే తరాల భావి భారత పౌరులను తీర్చిదిద్దేందుకు సాంకేతిక పరిజ్ఞానం, స్కిల్ డెవలప్‌మెంట్, మోడల్ విద్యను అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే వేములవాడ సమీపంలో దాదాపు రూ. 200కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణ పనులను ప్రారంభించుకుని ప్రాధాన్యత నిస్తున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన 'ట్యూస్‌డే (మంగళవారం) ప్రోగ్రామ్' పై మున్సిపల్ చైర్మన్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమాలద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్వాడీల ద్వారా అందుతున్న సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గత వారం 7వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కూడా పాల్గొని ఈ సేవల విశిష్టతను వివరించినట్లు గుర్తుచేశారు.ముఖ్యంగా ఒక సంవత్సరం నుండి ఆరు సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారుల్లో శారీరక వికాసం, అవయవాల ఎదుగుదల, మెదడు చురుకుదనం అత్యంత వేగంగా చోటుచేసుకుంటాయని, ఈ కీలక సమయంలో పిల్లలకు విటమిన్లు, ప్రొటీన్లతో కూడిన సమతుల్య పౌష్టికాహారాన్ని అందించడం అత్యవసరమని స్పష్టం చేశారు. సకాలంలో సరైన ఆహారం, పోషకాలు అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాలు,అంగవైకల్యం వంటి సమస్యలను తొలిదశలోనే సమర్థవంతంగా అరికట్టవచ్చని వివరించారు. ప్రస్తుత సమాజంలో చాలామంది తల్లిదండ్రులు రెండు,మూడేళ్ల వయస్సు రాగానే పిల్లలను ప్రైవేట్ పాఠశాలలు, ప్లే స్కూళ్లకు పంపుతూ, వారిని బుజ్జగించేందుకు కుర్కురే, చాక్లెట్లు, జంక్ ఫుడ్స్ అలవాటు చేస్తున్నారని, దీనివల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని హితవు పలికారు. దానికి భిన్నంగా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ ఉచితంగా అందిస్తున్న గుడ్లు, బలావర్ధకమైన పౌష్టికాహారం పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కావున పట్టణ ప్రజలు, తల్లిదండ్రులు ఈ వ్యత్యాసాన్ని గమనించి, తమ ఆరేళ్లలోపు పిల్లలందరినీ తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి, ప్రభుత్వం అందిస్తున్న ఈ మంచి అవకాశాలను ఆరోగ్యకరమైన ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్ ,స్థానిక వార్డు కౌన్సిలర్ బోనాల సాగరిక శివ , వేములవాడ అంగన్వాడీ సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆయాలు, వార్డు ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాంస్కృతిక వేదికపై పారమిత పాఠశాల సంగీత బృందం విజయదుందుభి





కరీంనగర్ టౌన్ నవంబర్ 3 (ప్రజా జ్యోతి)21వ అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవంలో గ్రూప్ మ్యూజికల్ బ్యాండ్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుతున్న పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు మరో అరుదైన ఘనతను సాధించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని ఐటీఎమ్ యూనివర్సిటీ గ్వాలియర్ లో అక్టోబర్ 23నుంచి 28వరకు నిర్వహించిన 21వ అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం ఉద్భవ్ ఉత్సవ్ 2026 లో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన మ్యూజిక్ బ్యాండ్ బృందం అద్భుత ప్రతిభ కనబరిచి గ్రూప్ మ్యూజికల్ బ్యాండ్ విభాగంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుందని పాఠశాల డైరెక్టర్ హనుమంత రావు తెలిపారు.ఉద్భవ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం, అంతర్జాతీయ సాంస్కృతిక ఒలింపియాడ్‌గా ప్రసిద్ధి చెందింది. ఈ అంతర్జాతీయ సాంస్కృతిక పోటీని మధ్యప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంచాలకుల ఆధ్వర్యంలో, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మరియు మధ్యప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక శాఖ సహకారంతో నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలో మంగోలియా, కిర్గిజిస్తాన్, స్లోవేకియా తదితర వివిధ దేశాలకు చెందిన కళాకారులు, సంగీత బృందాలు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిభావంతులైన బృందాలు పోటీపడటంతో ఈ పోటీ అత్యంత ఉత్కంఠభరితంగా, కఠినంగా సాగింది. ఇలాంటి తీవ్రమైన పోటీలో ప్రపంచ దేశాల ప్రతిభావంతులైన కళాకారులను అధిగమించి పారమిత హెరిటేజ్ పాఠశాల సంగీత బృందం కిట్ల చరణ్ యం. సాన్విరెడ్డి వి.అన్విక, సి.హెచ్.హన్నా క్రిష్ణసాయిపి.గౌతమ్ యం. సంరక్ష్, ప్రిశాంక్ ఠాకూర్ యం.శ్రియాన్ష్ కార్తికేయ యం. ఆన్సన్ మోసిస్, ఏవికె.క్రితిక్ ఏ.విహాన్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేష గౌరవంగా నిలిచింది. అలాగే వాద్య సంగీతం సోలో విభాగంలో 8 వ తరగతికి చెందిన కిట్ల చరణ్ ప్రథమ స్థానం, ఏవీకే క్రితిక్ ద్వితీయస్థానం సాధించారు.విద్యార్థులు ప్రదర్శించినక్రమశిక్షణ,సమన్వయం, అంకితభావం, సంగీత నైపుణ్యం ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. నిరంతర సాధన, సంగీత ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థులు ఈ అరుదైన విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు, అంతర్జాతీయ స్థాయిలో పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చిన విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ,కిరణ్, సాహు,సూరజ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేశ్, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, శర్మిష్ట, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన నిలిపిన లారీని ఢీకొని యువకుడు మృతి

- ఎర్రగుంటపల్లి శివారులో ఘోర రోడ్డు ప్రమాదం
- లారీ డ్రైవర్‌పై కేసు నమోదు



ధర్మారం,నవంబర్ 3 (ప్రజా జ్యోతి): రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక సూచికలు లేకుండా నిలిపి ఉంచిన లారీని ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. ఈ విషాదఘటన ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. రాగంపేట గ్రామానికి చెందిన తమ్మనవేణి శ్రీనాథ్ (27) బ్యాంకు పని ముగించుకుని సోమవారం రాత్రి సు మారు 9:30 గంటల ప్రాంతంలో తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఎర్రగుంటపల్లి శివారులో CG 04 PB 9215 నంబరు గల లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. లారీ డ్రైవర్ ఎలాంటి హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకుండా అజాగ్రత్తగా రోడ్డుపై లారీని నిలిపి ఉంచడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ నుదుటిపై, రెండు చేతులతో పాటు శరీరంలోని ఇతర భాగాల్లో తీవ్ర రక్తగాయాలయ్యాయి.మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ బీహార్ రాష్ట్రానికి చెందిన విక్కీ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోలార్ యూనిట్లు మహిళలకు వరం

- మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- సెర్ప్ సోలార్ డైరెక్టర్ కృష్ణ

పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 3 ప్రజా జ్యోతి:మహిళల ఆర్థిక స్వావలంబనకు, స్వశక్తి సంఘాల ఆదాయాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్లు వరం లాంటివని సెర్ప్ సోలార్ డైరెక్టర్ కృష్ణ అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నప్రభుత్వ సంకల్పంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.మంగళవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వశక్తి సంఘాల మహిళలకు నిర్వహించిన సోలార్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రెండు మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో భాగంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు మెగావాట్ల సోలార్ యూనిట్‌ను ముఖ్యమంత్రి స్వయంగా ప్రారంభించారని గుర్తు చేశారు.పెద్దపల్లి జిల్లా డీఆర్డీఓ కాలిందిని మాట్లాడుతూ మంథని మండలంలో ఒక మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ యూనిట్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో మరో ఒక మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించినట్లు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆదాయాభివృద్ధి సాధించాలని కోరారు.రెడ్‌కో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ సహజ వనరులు క్రమంగా అంతరించిపోతున్న నేపథ్యంలో సౌర విద్యుత్ వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆదాయం పొందే అవకాశాలను మహిళలు అందిపుచ్చుకోవాలని, ప్రతి స్వశక్తి సంఘం మహిళ తమ ఇంటిపై కూడా సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకునే దిశగా ఆలోచించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి అదనపు డీఆర్డీఓ బి. రవీందర్, మంచిర్యాల అదనపు డీఆర్డీఓ అంజయ్య, డీపీఎం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



బ్లూ బెల్స్ ఇన్నోవేటివ్ స్కూల్‌లో ఘనంగా ప్రీ-ప్రైమరీ డిస్‌ప్లే డే కార్యక్రమాలు





కరీంనగర్ టౌన్ నవంబర్ 3 (ప్రజా జ్యోతి) బ్లూ బెల్స్ ఇన్నోవేటివ్ స్కూల్‌లో మంగళవారం ప్రీ–ప్రైమరీ విద్యార్థుల కోసం నిర్వహించిన “ప్రీ–ప్రైమరీ డిస్‌ప్లే డే” కార్యక్రమం అట్టహాసంగా, ఉత్సాహభరితంగా జరిగింది. చిన్నారుల సృజనాత్మకత, ప్రతిభ, ఆత్మవిశ్వాసం, అభ్యసన నైపుణ్యాలకు ఈ వేడుక అద్భుత వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ జంగా సునీత మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అభినందించారు. ముఖ్యంగా మెలు గ్రూప్ మేనేజర్ సుప్రియ శ్రీధర్, అకడమిక్ అడ్వైజర్ సుప్రియ పాల్గొని విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, హ్యాండ్స్–ఆన్ లెర్నింగ్ ప్రాజెక్టులు, థీమ్ ప్రాజెక్టులు, స్టోరీ టెల్లింగ్, లిటరసీ కార్నర్స్, నంబర్ ఫన్ జోన్, టాలెంట్ షోకేస్ వంటి విభిన్న అంశాలను ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. తమ ప్రాజెక్టుల గురించి చిన్నారులు ధైర్యంగా వివరించడం, వివిధ సమూనాలను ప్రదర్శించడం తల్లిదండ్రులను, అతిథులను విశేషంగా ఆకట్టుకుంది.ఆధునిక విద్యా విధానంలో భాగంగా , స్మార్ట్ ఇంటరాక్టివ్ లెర్నింగ్ విధానాలను పరిచయం చేయడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, చిన్నారులకు పుస్తక జ్ఞానంతో పాటు అనుభవపూర్వక విద్య, సృజనాత్మక ఆలోచన, భావవ్యక్తీకరణ, సమస్య పరిష్కార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు చిన్న వయస్సు నుంచే అలవర్చడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయని తెలిపారు.విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను, తమ పిల్లలను ప్రోత్సహిస్తూ కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.ఈ వేడుకలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై గ్రామ ప్రజలకు అవగాహన

ముస్తాబాద్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గోపాలపల్లి గ్రామంలో ఆర్థిక సమ్మిళితంలో భాగంగా గ్రామ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌బీఐ పోతుగల్ శాఖ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆదాయాన్ని సక్రమంగా వినియోగించుకోవడంతోపాటు భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు అలవర్చుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY), ప్రధానమంత్రి సామాజిక భద్రత పథకాలు, అటల్ పెన్షన్ యోజన (APY) వంటి పథకాలలో చేరాలని కోరారు.అదేవిధంగా రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సిరిసిల్ల సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు బి. శ్రీకాంత్, ఎం. శ్రావణ్ కుమార్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వేములవాడ పట్టణ అభివృద్ధికి రూ.4.20 కోట్ల నిధులు

- వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శ్రీకారం!
- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో అభివృద్ధి పనులకు వేగం
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- 15వ వార్డు సంతోష్ నగర్, 4వ వార్డు జంబి గద్దె ప్రాంతాల్లో నిర్మాణ పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు ఆదేశం





వేములవాడ, నవంబర్, 3: ప్రజాజ్యోతి వేములవాడ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోంది.ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక సహకారం, చొరవతో పట్టణంలోని వివిధ వార్డుల్లో సుమారు రూ.4 కోట్ల 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేములవాడ పట్టణ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 15వ వార్డు సంతోష్ నగర్, 4వ వార్డు జంబి గద్దె ప్రాంతాల్లో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టనున్న పనుల వివరాలను సంబంధిత మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులకు సంబంధించిన ప్రణాళికలు, పనుల పురోగతి, ఉపయోగించనున్న నిర్మాణ సామగ్రి నాణ్యత, స్థానికంగా ఉన్న సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి వార్డుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపల్ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుతున్నాయని, ఆయన సహకారం, మార్గదర్శకత్వంలో వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతున్నట్లు వివరించారు. సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీల్లో రాకపోకలు సులభతరం అవుతాయని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో మురుగునీటి సమస్యలు తగ్గి పరిసరాల పరిశుభ్రతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల ప్రయోజనాలు నేరుగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్మాణ పనుల విషయంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు చైర్మన్ స్పష్టం చేశారు. ఉపయోగించే సిమెంట్, కంకర తదితర నిర్మాణ సామగ్రి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సూచించారు. పనులు కేవలం పూర్తిచేయడమే కాకుండా, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నిబంధనలప్రకారం నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పనుల నిర్వహణ సమయంలో స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సంబంధిత అధికారులు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ, పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, వార్డుల వారీగా ప్రజల సమస్యలను గుర్తించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా పుల్కం రాజు తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తోట రాజు, టీఓ అన్వేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌నినో పరిస్థితుల మార్పులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్





మంథని, నవంబర్ 03 ప్రజాజ్యోతి ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మండల పరిషత్ ప్రత్యేక అధికారి పూర్ణ చందర్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎంపీడీవో శ్రీజా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, టీజీఈఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ఎల్‌నినో ప్రభావం వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు అవసరమైన సూచనలు, వ్యవసాయ సలహాలు అందించాలని కోరారు.వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులకు తగిన సూచనలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పశువులకు తాగు నీటి సమస్య రాకుండా చెరువులు, కుంటల్లో నీరు ఉండేలా చూడాలని సర్పంచులకు సూచించారు. ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అనేక గ్రామాల్లో గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు రూ. 20లక్షల నుంచి రూ. 25లక్షల చొప్పున, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి రూ. 12లక్షల చొప్పున, మహిళ సంఘాల వివో కార్యాలయ భవన నిర్మాణాలకు రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే గోదావరి నది పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాములపల్లి గ్రామంలో నూతన ఫార్మేషన్ రోడ్డు ను ప్రారంభించిన సర్పంచ్

- రైతుల రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం గ్రామ సర్పంచ్



పెద్దపల్లి నవంబర్ 03 (ప్రజా జ్యోతి) ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామం లో వి బి జి రామ్ జి పథకంలో భాగంగా గంగిరెద్దుల వాడ నుంచి గర్రెపల్లి మొగిలి పొలం వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఫార్మేషన్ రోడ్డును గ్రామ సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడు తూ గ్రామంలోని రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు, పంటలను తీసుకువచ్చేందుకు రహదారి సౌకర్యం ఎంతో అవసరమని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నూతన ఫార్మేషన్ రోడ్డును ఏర్పాటు చేసిన ట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిట్ల విద్యాలత విజయ్ ,పం చాయతీ కార్యదర్శి హరిబాబు, వార్డు సభ్యులు ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్ ,ఉపాధి హామీ కూలీలు రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం

► ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట నవంబర్3 (ప్రజా జ్యోతి)



రైతులు కంటనీరు పెట్టకుండా వారి అభివృద్ధి సంక్షేమానికి పాటు పడాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంపై ఉందని మానకొండూరు ఎమ్మెల్యే టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్ లో మంగళవారం జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ శ్రీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు .మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా అంతగిరి సాహిత్య వినయ్ కుమార్,వైస్ చైర్మన్‌గా భరత్ రెడ్డి, డైరెక్టర్లుగా వి. మల్లయ్య,బడుగు లింగయ్య,వి.శ్రీనివాస్ రెడ్డి, జెట్టి మల్లేశం, మంద బాల్ రెడ్డి, వెలిశాల జ్యోతి, బంగారి అంజయ్య, ఎరుకల తిరుపతి, జుట్టు నగేష్, ఎం. నవీన్ రెడ్డి, ఉప్పల వేణు, జి. శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా అందించే సేవలతో రైతులు సంతోషంగా ఉండాలే తప్ప బాధతో కంటనీరు పెట్టే పరిస్థితి కల్పించొద్దన్నారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, మార్కెట్ కమిటీకి రైతులు అండగా ఉండాలన్నారు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్ నిత్యం రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ఇల్లంతకుంట మార్కెట్ కమిటీని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ మార్కెట్ ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మార్కెట్ యార్డును అన్నిరకాలుగా అభివృద్ధి పరుస్తూ రైతులు పండించి పండించిన ధాన్యానికి భద్రత కల్పించేందుకు గోదాముల నిర్మాణం అనేక వసతులు కల్పించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. రైతులకు మార్కెట్లో అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పాలకమండలి పని చేయాలని సందర్భంగా పేర్కొన్నారు.

›› రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఆది నుండి కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమానికి పాటుపడుతూనే ఉందని ఆ క్రమంలోనే రేవంత్ రెడ్డి సర్కారు ఈ దిశగా ముందుకు సాగుతున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు.బీఆర్ఎస్ పాలనలో లక్ష రూపాయల రుణమాఫీ చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణ మాఫీ చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో తూకాల పేరుతో భారీ మోసాలు జరిగాయని, వాటికి చెక్ పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల కొనుగోలు కేంద్రాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు కూడా జమ అవుతుందని ఆయన చెప్పారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు లాభం, గిట్టుబాటు కల్పిస్తున్నామని చెప్పారు. రైతులకు రైతుపై ట్రాక్టర్లు,విత్తనాలు, ఎరువులు ఇప్పిస్తున్నామన్నారు. ఎల్ నినో ప్రభావం రానున్న రోజుల్లో తీవ్ర రూపం దాల్చనున్నదని, ఈ దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టిసారించాలని చెప్పారు.

›› అక్రమంగా సాగునీరు మళ్లింపు

మిడ్ మానేరు నుంచి అనంతరం మల్లన్నసాగర్ మీదుగా వచ్చే నీటిని పైపులైన్ల ద్వారా అక్రమంగా కేసీఆర్ తన రేపల్లి లో ఫామ్ హౌస్ వద్ద పంద ఎకరాల్లో నిర్మించిన చెరువుకు మళ్లించారని ఎమ్మెల్యే ఆరోపించారు.

›› ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలి

అందరికీ పదవులు సాధ్యం కానప్పటికీ కష్టపడ్డోళ్లకు మాత్రం పదవులు కట్టబెట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. కష్టపడుతున్న వారికి పదవులు కల్పించే విషయంలో నిరంతరం తన ప్రయత్నం కొనసాగుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పదవులు రానంత మాత్రాన పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు నిరాశ పడకూడదని, ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపిక,సహనం,సంయమనం కోల్పోకూడదని ఆయన సూచించారు. నిరీక్షణ, ఓపిక తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. నిఘంటువులు వెతకండి

›› ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం

ఏఎంసి పాలకవర్గ ప్రమాణ స్వీకారం స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు ఇల్లంతకుంటకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు భారీగా తరలివచ్చి మంగళహారతులతో స్వాగతం పలికారు. క్రేన్ సహాయముతో గజమాలవేసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆ మహనీయుని విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఎడ్ల బండిపై సభా ప్రాంగణానికి బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రజా పాలన రథం ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలోని ఇందిరా గాంధీ విగ్రహానికి, తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం సభా ప్రాంగణానికి డప్పు చప్పులతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఇల్లంతకుంట,పాక్స్ చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, మానకొండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి,బెజ్జంకి నుస్తులాపూర్,పోరండ్ల, ఊటూరు పాక్స్ చైర్మన్లు ఒగ్గు దామోదర్, మోరపల్లి రమణారెడ్డి, గోపు తిరుపతిరెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు రాఘవరెడ్డి, పసుల వెంకటి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ప్రసాద్, ఉప్పగల్ల మల్లారెడ్డి, జనగాం రాజయ్య,ముస్కు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

సమగ్ర వివరాలను పరిశీలించి రీ సర్వేలో నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- చందుర్తి మండలం ఎన్గల్ లో భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన



వేములవాడ,నవంబర్,3:ప్రజాజ్యోతి మంగళవారం రోజున అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, చందుర్తి మండలం ఏనుగల్ గ్రామంలో భూముల రీ సర్వేప్రక్రియలో పాల్గొని గ్రామంలోని ప్రభుత్వ, పట్టా భూములకు సంబంధించిన సరిహద్దులు,విస్తీర్ణం,సర్వేనంబర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఖచ్చితత్వంతో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు.చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో కొనసాగుతున్నభూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వేనిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ... రీ సర్వేలో సేకరించే వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి విస్తీర్ణం,హద్దులు పరిశీలించిన అనంతరం నమోదు చేయాలనిస్పష్టం చేశారు. సర్వే ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.భూముల రీ సర్వే ఉద్దేశ్యం, నిర్వహణ విధానంపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని, రైతులు ఆందోళనలకు గురికాకుండా రీ సర్వేప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు.పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ భూపతి, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లకై నిరవధిక సమ్మె

- తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి
- గౌరవ వేతనం చెల్లించాలి..



రామడుగు, నవంబర్ 03,(ప్రజా జ్యోతి) తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆశ వర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నవంబర్ 15 నుండి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కూడిన పత్రాన్ని సంబంధిత అధికారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశా వర్కర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమని గుర్తించి 18 వేల కనీస వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పిఎఫ్,పెన్షన్ సౌకర్యం కల్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 20 సంవత్సరాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషించే తమకు కనీస గుర్తింపు లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్న ఆశా వర్కర్ల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాల పేరుతో ఆశా కార్యకర్తలపై పని భారం పెంచుతున్నారే తప్ప తమను గుర్తించి కనీస వేతనం ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని లేనియెడల విధులను బహిష్కరించి పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించరాదు

► జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పంజెలా ఆల్ఫ్రెడ్





వేములవాడ,నవంబర్,3:ప్రజాజ్యోతి రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ), రుద్రంగి సబ్ సెంటర్ మరియు మానాల బడి తండాలో ఆకస్మికంగా పర్యటించి వైద్య సేవలను, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు, రిజిస్టర్లు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, ముఖ్యంగా మాతా శిశు ఆరోగ్య సేవలు (ఏం సీ హె చ్), గర్భిణీ స్త్రీల ముందస్తు నమోదు, గర్భిణులకు అవసరమైన పరీక్షలు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపుపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.అలాగే నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడి)కార్యక్రమంలో భాగంగా ప్రజలందరికీ నిర్దేశిత లక్ష్యాల మేరకు స్క్రీనింగ్ నిర్వహించి, వ్యాధులు గుర్తించిన వారికి సకాలంలో చికిత్స అందిస్తూ నిరంతరం ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు.టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం కింద క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని ముందుగానే గుర్తించి పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స ప్రారంభించి చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలని తెలిపారు.హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన వారికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి, బాధితులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు.అదేవిధంగా జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం (ఏన్ వి బీ డీ సీ పీ) కింద డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలు, యాంటీ లార్వల్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి మంగళవారం , శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు నాణ్యతతో అమలు చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు.ఈ కార్యక్రమంలో చందుర్తి వైద్యాధికారి డాక్టర్ జీవన జ్యోతి,సంబంధిత వైద్యసిబ్బంది, ఇతర ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలు నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సిపిఐ నాయకులు చాడ వెంకటరెడ్డి
- రామడుగులో ఎండిన పంటల పరిశీలన



రామడుగు, నవంబర్ 03(ప్రజా జ్యోతి) ఎలినినో ప్రభావంతో రైతులకు నీరందక పంట పొలాలు ఎండిపోతున్నరైతాంగాన్ని ప్రభుత్వం పట్టించుకోని తక్షణ సహాయం అందజేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రామడుగు మండలం మోతే గ్రామంలో సిపిఐ నాయకులతో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు స్పష్టంగా కనబడుతున్నాయని వర్షపాతం తక్కువ నమోదు కావడం మూలంగా రైతులు వేసిన పంటలు ఎండిపోయాయని ఎకరానికి ఒక్కో రైతు 30వేల పైననే పెట్టుబడి పెట్టి నష్టపోయారని అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు కరువు ప్రాంతాల్లో పర్యటించి ఆయా మండలాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని కంటితుడుపు చర్యలు చేపట్టి కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం బాధాకరమని అన్నారు. కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి జాతీయ విపత్తుగా ప్రకటించడానికి కృషి చేయాలని కేంద్రం నుండి ప్రత్యేక నిధులను విడుదల చేయడానికి ప్రయత్నించాలని ఎండిపోయిన పంటలకు ఎకరానికి 30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అంది స్వామి,జిల్లా కార్యవర్గం కౌన్సిల్ సభ్యులు కొయ్యాడ సృజన్‌కుమార్,బోయిని అశోక్, గూడెం లక్ష్మి, సురేందర్ రెడ్డి, మచ్చ రమేష్, పంజాల శ్రీనివాస్, తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి దాతల సహాయం

- హర్షం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు

రామడుగు, నవంబర్ 03(ప్రజా జ్యోతి) రుద్రారం గ్రామానికి చెందిన నెల్లి శ్రీను మృతి చెందడంతో కుటుంబం ఆర్థిక భరోసా లేక తీవ్ర విషాదంలో మునిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుర్రం దేవిక రాజశేఖర్ దాతల సహాయం కోరగా పలువురు స్పందించడంతో జమ చేసిన మొత్తం డబ్బులను మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవిక రాజశేఖర్ మాట్లాడుతూ ఆపదలో స్పందించి కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, కలిగించే సయ్యద్ జుబేర్‌పై రౌడీ షీట్ ఓపెన్

- సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్ర చారి



ఎల్లారెడ్డిపేట నవంబర్ 3ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన సయ్యద్ జుబేర్ అనే వ్యక్తి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అతని నేర ప్రవృత్తి ని పరిగణలోకి తీసుకొని అతనిపై రౌడీ షీట్ ఓపెన్ చేయడం జరిగిందని సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్ర చారి తెలిపారు.ఈ సందర్భంగా డిఎస్పి గారు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా, ముఖ్యంగా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న డిమాండ్



ముస్తాబాద్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల్ లో రైతులు పండించిన వర్షాకాలం ధాన్యాన్ని గతంలో మాదిరిగానే ఎలాంటి ఆంక్షలు, షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న డిమాండ్ చేశారు.ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ఎలాంటి నిబంధనలు విధించకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.వర్షాకాలంలో కురిసిన వర్షాలతో గోదావరి జలాలను సముద్రం పాలుచేసి, ప్రస్తుతం యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. గోదావరి జలాలను ఎత్తిపోసి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ పార్టీ పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఆయన వ్యాఖ్యానించారు.కూటిలో రాయి తీయనివారు ఏటిలో రాయి తీస్తామన్నట్లుగా ఢిల్లీలో ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలు చేయాలని, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భోంపెల్లి సురేందర్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు, ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ చైర్మన్ కృష్ణా రెడ్డి, ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నల్ల నరసయ్య, బీఆర్ఎస్ నాయకులు రాచమడుగు సంతోష్ రావు, చెవుల మల్లేశం యాదవ్, మెంగని మనోహర్,మండల యువజన అధ్యక్షుడు శీలం స్వామి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు ఎండీ నవాజ్, రామలక్ష్మణపల్లె సర్పంచ్ ఎల్లయ్య, కోడే శ్రీనివాస్, సుంచు గణేష్, పల్లె సత్యం గౌడ్, మొగ్రాయిపల్లె ఉపసర్పంచ్ పల్లె ఆనంద్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్లాపూర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



చొప్పదండి ,నవంబర్ 3 (ప్రజాజ్యోతి): చొప్పదండి మండలం గుమ్లాపూర్ లో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు,సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ కార్డులతో పాటు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని అన్నారు.గత బారాసా ప్రభుత్వం 10సంవత్సరాలు అధికారం లో ఉన్నప్పటికీ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. ఎల్ నినో ప్రభావంతో రాబోవు రోజుల్లో తీవ్రమైన కరువు ఏర్పడనుందని, నీటి నిలువలు తగ్గి సాగునీటికి తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. దాని ప్రభావాన్ని కొంతమేర తగ్గించడానికి నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను సాగుచేయాలని కోరారు.గ్రామంలో ప్లాస్టిక్ పదార్థాలను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని చెప్పారు. అనంతరం అధికారులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ లింగాల ఆనంద్,ఉప సర్పంచ్ ఇనుకొండ రమణ రెడ్డి,ఆర్నకొండ సింగిల్ విండో చైర్మన్ ఎన్నం మనోహర్,చొప్పదండి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్,నాయకులు నెరుమట్ల మల్లేశం, మండల లచ్చయ్య,కడారి శంకర్ పాల్గొన్నారు.

రంజిత్ కుటుంబానికి అండగా మిత్రులు, కుల బంధువులు

- పెద్ద కుమార్తె పేరు మీద పదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్.. మొత్తం రూ.57,500 ఆర్థిక సాయం

ఇల్లందకుంట నవంబర్ 3(ప్రజా జ్యోతి): బూర్ల రంజిత్ మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో మిత్రులు, 10వ తరగతి స్నేహితుల బృందం, మన సిరిసేడు గ్రూప్ సభ్యులు, పద్మశాలి కుల బంధువులు మానవతా దృక్పథం తో ముందుకొచ్చారు. రంజిత్ కుటుంబానికి అండగా నిలుస్తూ మొత్తం రూ. 57,500 ఆర్థిక సహాయం అందించారు.ఈ మొత్తంలో రూ.50,500లను రంజిత్ పెద్ద కుమార్తె పేరు మీద పోస్టాఫీస్‌లో పదేళ్ల కాలపరిమితితో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మిగిలిన రూ.7,000లను ఆయన భార్యకు కుటుంబ అవసరాల నిమిత్తం అందజేశారు.రంజిత్ కుటుంబం కష్టకాలంలో ఉన్న సమయం లో మిత్రులు,కుల బంధువులు స్పందించి ఆర్థిక సహాయం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.వెల్ది శివశర్మ, కొక్కుల లక్ష్మీపతి, చేరాల వైకుంఠం, కురిమిళ్ళ రాజు, ఆరుకాల రాజు తదితరులు పాల్గొన్నారు.ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఈ మిత్ర బృందం నిరూపించింది.



రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి



గోదావరిఖని, నవంబర్ 2 (ప్రజా జ్యోతి): నీటి పంపిణీ వ్యవస్థ మెరుగు పర్చి 24/7 సరఫరా చేయడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాల ఆవరణలో ఉపరితల జలాశయ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ కారెంగుల రమ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నీటి సరఫరా వ్యవస్థ మెరుగు పర్చడానికి ఎం ఎల్ ఏ ఎం ఎస్ రాజ్ ఠాకూర్ సుమారు రూ.100కోట్లు మంజూరు చేయించారని అన్నారు. ఇందులో భాగంగా రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఎనిమిది ఉపరితల జలాశయాలు,కొత్త పైప్ లైన్ల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు.సుమారు రూ 2కోట్ల అంచనా వ్యయంతో నర్సింగ్ కళాశాల ఆవరణలో నిర్మించతల పెట్టిన ఉపరితల జలాశయం సామర్థ్యం 8లక్షల లీటర్లు ఉంటుందని సుమారు 10వేల జనాభా అవసరాలు తీరుస్తుందన్నారు.ఒక సంవత్సరం లోగా పనులు పూర్తి చేస్తామని అన్నారు.46వ డివిజన్ ఇందిరా నగర్ లో నిర్వహించిన మరో కార్యక్రమంలో సి సి రోడ్డు నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామగుండంలో ప్రతి వీధిలోని చివరి ఇంటివరకు కూడా అంబులెన్స్ వెళ్ళడానికి రోడ్డు,యు జి డి,రక్షిత మంచి నీటిని అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నామని అన్నారు.పట్టణ నడిబొడ్డున ఉన్నప్పటికీ గత పాలకులు పట్టించుకోకపోవడంతో మురికి కూపంగా మారిన ఇందిరా నగర్ లో రాజ్ ఠాకూర్ ఎం ఎల్ ఏ గా ఎన్నికైన తరువాత స్టార్మ్ వాటర్ డ్రైనేజ్ నిర్మించి పైన జాలీ కూడా వేయించారని గుర్తు చేశారు.వేర్వేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు దాసరి సాంబమూర్తి,వడ్లూరి రవి,నాయకులు దాసరి విజయ్,కల్వల రంజిత్,కన్నూరి శంకర్,నగర పాలక సంస్థ ఎ ఇ మీర్,సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందేలా కొనుగోలు కేంద్రాలు

- ఖరీఫ్‌లో 4.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- నవంబర్ రెండో వారం నుంచి భారీగా కొనుగోళ్లు
- 311 కేంద్రాలు ప్రారంభించాం : కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 3 ప్రజా జ్యోతి: ధాన్యం పండించిన రైతులు మద్దతు ధర కంటే తక్కువకు బహిరంగ మార్కెట్లో విక్రయించి నష్టపోయే పరిస్థితి రాకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 4.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తుండగా, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రతిపాదించిన 311 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్ సీజన్ 2026 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో 4.69 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం, 26 వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం ఉత్పత్తి కానుందని తెలిపారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు అదనంగా రూ.500 బోనస్ అందిస్తుందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో ధాన్యం ధరలు తగ్గినప్పుడు రైతులు నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని అధికారులను ఆదేశించారు. సన్నరకం ధాన్యం విక్రయించే రైతులకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందేలా కొనుగోళ్లు చేపట్టాలని స్పష్టం చేశారు.నవంబర్ రెండో వారం నుంచి జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లన్నీ ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 311 కొనుగోలు కేంద్రాలకు సుమారు 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,62,500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములు అందుబాటులో ఉన్నాయని వివరించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్షలో డీసీఓ శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, డీఆర్డీఓ కాలిందిని తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలిచిన జీవన్ జ్యోతి బీమా

- బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం
- తక్కువ ప్రీమియంతో కుటుంబానికి ఆర్థిక భరోసా



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 3 ప్రజా జ్యోతి:కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నబాధిత కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన అండగా నిలిచింది. తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న ఈ పథకం ద్వారా అగ్గి శ్రావణ్ కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం అందింది. ఆ పద సమయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు.ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సబితం శాఖ పరిధిలో ఖాతాదారుగా ఉన్న అగ్గి శ్రావణ్ తల్లి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో సభ్యత్వం పొందారు. ఆమె మృతి చెందడంతో పథకం నిబంధనల ప్రకారం ఎల్ఐసీ ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా పరిహారం చెక్కును సోమవారం బ్యాంకు అధికారులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలు తక్కువ ప్రీమియంతో సామాన్యులకు బీమా రక్షణ కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాల్లో సభ్యత్వం పొందాలని, అనుకోని ఆపదలు ఎదురైనప్పుడు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచే బీమా రక్షణను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.బ్యాంకు మేనేజర్ రమేష్, అసిస్టెంట్ మేనేజర్ దేవాన్ష్, క్యాషియర్ సదయ్య, బ్యాంకు సిబ్బంది, లబ్ధిదారుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



గోదావరిఖని, నవంబర్ 3 (ప్రజా జ్యోతి):రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను,ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పూర్తయిన పనుల నాణ్యతను సమీక్షించడంతో పాటు,కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు.27వ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి,ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ అయేషా వాజీద్ ఖాన్ స్థానిక 27 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొయిన్ పప్పి పాల్గొన్నారు.

మోర్రపూర్, గూడూరు గ్రామాల్లో రీ-సర్వే క్షేత్రస్థాయి పరిశీలన



ముస్తాబాద్: నవంబర్ 3(ప్రజా జ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మోర్రపూర్, గూడూరు గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీ–సర్వే పనులను రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీధర్ బాబు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే సిబ్బందితో మాట్లాడి ఇప్పటివరకు చేపట్టిన సర్వే పనుల పురోగతిని, సర్వే ప్రక్రియను సమీక్షించారు. రీ–సర్వే పనులను నాణ్యతతో, పూర్తి పారదర్శకతతో నిర్దేశిత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, మోర్రపూర్, గూడూరు గ్రామాల సర్పంచ్‌లు, సిరిసిల్ల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటాచారి, డిప్యూటీ తహసీల్దార్, గిర్దావర్లు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆరోపణలు నిరాధారం

- గత పదేళ్ల పాలనలో అవినీతికి కేరాఫ్ బీఆర్ఎస్
- బీజేపీ కార్పొరేటర్లు బండారి వేణు, సోమిడి వేణు



కరీంనగర్, నవంబర్ 3 (ప్రజాజ్యోతి):బీజేపీ పాలకవర్గంపై బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్ చేసిన ఆరోపణలను బీజేపీ కార్పొరేటర్లు బండారి వేణు,సోమిడి వేణు తీవ్రంగా ఖండించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పార్టీ అంతర్గత సమావేశంలో పాలకవర్గానికి చేసిన సూచనలను వక్రీకరించి నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.మంగళవారం కరీంనగర్‌లో ని ర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలకవర్గం పదేళ్ల పాలనలో అవినీతి, భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉంద ని ఆరోపించారు. గతంలో కొందరు కార్పొరేటర్ల అవినీతి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలకు మంచి పాలన అందించాలని బండి సంజయ్ తమకు దిశానిర్దేశం చేశారని స్పష్టం చేశారు.ప్రతి నెలా కేంద్ర మంత్రి బండి సంజయ్ నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలపై పాలకవర్గానికి సూచనలు చేస్తున్నారని తెలిపారు.బీఆర్ఎస్ నేతలు తమ నాయకులు, పాలకవర్గంపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.నగర ప్రజలకు పారదర్శకమైన,మెరుగైన పాలన అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలి

- మండల వ్యవసాయ అధికారి ఉమాపతి



ఎలిగేడు అక్టోబర్ 03 (ప్రజా జ్యోతి) మండలంలోని లాలపల్లి, ముప్పిరితోట, బురహాన్ మియాపేట గ్రామాల్లో రైతులకు మండల వ్యవసాయ అధికారి ఎం. ఉమాపతి ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఉమాపతి,మాట్లాడుతూ.ఎల్‌నినో ప్రభావంతో సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో నీటి వనరులు తగ్గి, ఎండ తీవ్రత పెరిగే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల యాసంగిలో అధిక నీటి వినియోగం అవసరమైన వరి పంటకు బదులుగా మొక్కజొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, పెసర, మినుము, నువ్వులు, శనగ వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం ఉమాపతి సర్పంచులు, ఏలేటి వెంకట్ రెడ్డి , గోపు రజిత లక్ష్మారెడ్డి, ఏఈఓ లు సురేష్ ,గణేష్, నరేష్ రైతులు పాల్గొన్నారు.

కదులుతున్న లారీ నుంచి రోడ్డుపై పడి పోయిన భారీ చైన్ జేసీబీ

- తృటిలో తప్పిన పెను ప్రమాదం



ఎల్లారెడ్డిపేట నవంబర్ 3 (ప్రజా జ్యోతి) మండలంలోని రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ వద్ద భారీ ప్రమాదం తృటిలో తప్పింది. లారీలో తరలిస్తున్న భారీ చైన్ జేసీబీ ఒక్కసారిగా కదులుతున్న లారీ నుంచి జారి రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ సమీపంలో లారీలో భారీ చైన్ జేసీబీని తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జేసీబీ రోడ్డుపై పడిపోయిన సమయంలో సమీపంలో వాహనాలు, పాదచారులు ఎవరూ లేకపోవడంతో భారీ యంత్రాలను లారీలపై తరలించే సమయంలో తగిన భద్రతా చర్యలు, పటిష్టమైన బిగింపులు తప్పనిసరిగా పాటించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

ఉప సర్పంచ్ పై దాడిని ఖండించిన రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు కార్తీక్

ఎల్లారెడ్డిపేట నవంబర్ 3 ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండలంలోని మండలం బండ లింగంపల్లి గ్రామం ఉపసర్పంచ్ బోర్డు రాజు పై జరిగిన కత్తి దాడిని ఉప సర్పంచ్ల గౌరవం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు కార్తీక్ తీవ్రంగా ఖండించారు దాడిలో గాయపడిన బొడ్డు రాజు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరం తరపున పూర్తి మద్దతు ప్రకటించారు గ్రామాల్లో అభివృద్ధికి ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు కీలకపాత్ర పోషిస్తారని ప్రజా సమస్యల పరిష్కారం తీరంతరం పనిచేస్తున్నారని ప్రజా ప్రతినిధులపై దాడిని దురదృష్టకరంగానే బొడ్డు కార్తీక్ అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జిల్లా పోరం అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు మందాటి రాము యాదవ్ జిల్లా కమిటీ సభ్యులు కొరివి అనిల్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు



ఆడబిడ్డల పెళ్లి భారం తీరుస్తున్న కల్యాణలక్ష్మి

- గంగాధర మండలంలో రూ. 30.28 లక్షల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- మహాలక్ష్మి నుండి కల్యాణలక్ష్మి వరకు.. అంతా మహిళల సంక్షే మమే: మేడిపల్లి సత్యం





గంగాధర 3నవంబర్ 2026 (ప్రజా జ్యోతి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడపిల్లల పెళ్లిళ్లకు 'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు కొండంత ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 30,28,509 (ముప్పై లక్షల ఇరవై ఎనిమిది వేల ఐదు వందల తొమ్మిది రూపాయలు) విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అనేక అద్భుతమైన పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, గృహ జ్యోతి పథకంతో పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గుర్తు చేశారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందజేస్తూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రజలందరూ ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ అధికారిక కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, గంగాధర తహశీల్దార్ అంబటి రజిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, మాజీ జెడ్పీటీసీ గునుకొండ బాబు, సత్తు కనకయ్య మరియు సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు ముద్దం నగేష్ పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పదాల భాగ్యలక్ష్మి – రాజన్న, వేముల భాస్కర్, రామిడి రాజిరెడ్డి, రెండ్ల శ్రీనివాస్, బీర్ల ఆనందం, ఆరె తేజశ్రీ – రాజశేఖర్, మల్కాపురం రాజేశ్వరి – రాజేశం, కడారి రేణుక – కనకయ్య, ఎట్టవేని శ్రీనివాస్, కోలేపాక కవిత – మల్లేశం, ధీకొండ బాబలక్ష్మి – మధు, దానే అనసూర్య – ఓదెలు, గుండవేని లావణ్య – తిరుపతి, ఎట్టెపు కనకయ్య, గంకిడి సంధ్యరాణి – చంద్ర రెడ్డి, మరియు ముఖ్యనాయకులు సాగి అజయ్ రావు, రోమల రమేష్, కర్ర బాపు రెడ్డి, రాచమల్ల భాస్కర్, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, బురుగు గంగన్న, అత్తపురం తిరుపతి, గంగాధర ప్రవీణ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి భీమా చెక్కు అందజేత



మల్యాల,నవంబర్ 3, ప్రజా జ్యోతి: మండలంలోని మానాల గ్రామంకు చెందిన సిలివేరు కిషన్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు.తనకు నామిని అయినా భార్య సిలివేరు శ్యామలకు 2,00,000/-(రెండు లక్షల రూపాయల బీమా)ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా చెక్కు ను కేడీసీసీ బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్,ఉప సర్పంచ్ తిరుపతి గ్రామ పంచాయతీ హనుమాన్ చౌరస్తా లో అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బీమా అవగాహన కార్యక్రమంలో మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు బీమా సదుపాయం కల్గి ఉండాలి అని ఆపద సమయంలో బీమా కొండంత అండగా ఉంటుంది అన్నారు. గ్రామ ఉప సర్పంచ్ ,సీ యఫ్ ల్ కౌన్సిలర్లు వెంకటేష్,రమేష్,విజయ్,కేడీసీసీ బ్యాంకు సిబ్బంది,డైరెక్టర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సూరంపేటలో చైన్ స్నాచింగ్

► మహిళ మెడలోని పుస్తెలతాడు అపహరణ



కొడిమ్యాల, నవంబరు 3 (ప్రజాజ్యోతి): ధాన్యం ఆరబెట్టేందుకు ఐకేపీ కేంద్రానికి వెళ్తున్న మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. ఈ ఘటన మండలంలోని సూరంపేట శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం తండాకు చెందిన అజ్మీర దూరి ఉదయం ఐకేపీ కేంద్రానికి నడుచుకుంటూ వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ముగ్గురు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయండి

► డిపో మేనేజర్‌కు సర్పంచ్ వినతి



కొడిమ్యాల,నవంబర్ 03, (ప్రజాజ్యోతి): మండలంలోని ఎంపీడీఓ,తహసీల్ కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ రిక్వెస్ట్‌స్టాప్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు వేములవాడ డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.ప్రస్తుతం బస్సులు ఎక్కేందుకు ప్రధాన బస్టాండ్‌కు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయం వద్ద బస్సుల నిలుపుదలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పిట్టల రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



గొల్లపెల్లి నవంబర్ 3 ప్రజాజ్యోతి జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చందోలి గ్రామానికి చెందిన పిట్టల రమేశ్ మృతిపట్ల రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు పిట్టల రమేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు గత నెల 25వ తేదీన తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఆయన మృతి చెందారు ఈ విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చందోలిలోని రమేశ్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రమేశ్ కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వెలమ సంఘం అధ్యక్షుడికి మంత్రి సన్మానం



బుగ్గారం, నవంబర్ 3(ప్రజాజ్యోతి): సిరికొండ గ్రామ వెలమ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొండపల్కుల దామోదర్ రావును రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెలమ సంఘం ఏర్పాటు కావడం సంతోషకరమని, ప్రజా ప్రభుత్వం అన్ని కుల సంఘాలకు ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచిత ధర్మరాజు, ఉప సర్పంచ్ గజ్జెల విజయ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాల మహానాడు కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పులి సుధీర్ నియామకం



కొత్తపల్లి / నవంబర్ 3, (ప్రజా జ్యోతి) మాల మహానాడు (చెన్నయ్య సంఘం) కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పులి సుధీర్‌ను నియమించినట్లు సంఘం నాయకులు ప్రకటించారు.ఈ సందర్భంగా పులి సుధీర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు బలోపేతానికి, మాల సామాజిక వర్గ అభ్యున్నతికి, హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.సంఘం ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లాలోని మాల సోదరులందరినీ ఐక్యం చేసి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.పులి సుధీర్ నియామకం పట్ల పలువురు నాయకులు, సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

బీర్ పూర్ మండలంలో అదనపు డీఆర్‌డీఓ మదన్ మోహన్ తనిఖీలు

- ఇంకుడు గుంతల పనుల పరిశీలన.. ఉపాధి హామీపై సమీక్ష
- లక్ష్యం 1000 మంది కూలీలు డీఆర్‌డీఓ ఆదేశం



బీర్ పూర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): బీర్ పూర్ మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం జిల్లా అదనపు డీఆర్‌డీఓ మదన్ మోహన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మండలంలోని చర్లపల్లి గ్రామంలో వి.బి.జి రామ్ జీ పనులతో పాటు, గ్రామంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ సోక్ పిట్స్ (సామూహిక ఇంకుడు గుంతలు), వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. అనంతరం, నరసింహల పల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణ పనులకు ముగ్గు పోసి పనులను ప్రారంభించారు.

›» ఉపాధి హామీపై సమీక్ష: రోజుకు 1000 మంది కూలీలు వచ్చేలా చూడాలి

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వి.బి.జి రామ్ జీ సిబ్బందితో అదనపు డీఆర్‌డీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఉపాధి హామీ పనులను ముమ్మరం చేయాలని, ప్రతి రోజు కనీసం 1000 మంది లేబర్ (కూలీలు) పనులకు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయని పక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన మరియు సమీక్షా కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ, ఎంపీవో, వి.బి.జి రామ్ జీ సిబ్బంది, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఒకవైపు నిర్మాణంతో వరద ముప్పు తప్పదంటున్న స్థానికులు

- నిధుల కొరతతో నిలిచిన మరోవైపు నిర్మాణ ప్రతిపాదన.. మంత్రి అడ్లూరి చొరవ చూపాలని వినతి



బుగ్గారం, నవంబర్ 3 (ప్రజాజ్యోతి): బుగ్గారం మండల కేంద్రంలోని జంగ ఒర్రె సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఏళ్ల తరబడి వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ ఒర్రెపై కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కొంత ఊరట లభించినప్పటికీ, ఒకవైపు మాత్రమే నిర్మాణం చేపడితే సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం కల్వర్టు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు కాగా, ఒకవైపు పనులు పూర్తి చేయడానికే సుమారు రూ.15లక్షలు అవసరమవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒర్రెకు ఇరువైపులా కల్వర్టులు నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే మంజూరైన నిధులకు అదనంగా మరో రూ.20 లక్షలు అవసరమని పేర్కొంటున్నారు. నిధుల కొరత కారణంగా మరోవైపు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.వర్షాకాలంలో జంగ ఒర్రెకు భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు,రైతులు,కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లోనూ ఈ మార్గంలో ప్రయాణించడం కష్టతరంగా మారుతోంది.ఒకవైపు మాత్రమే కల్వర్టు నిర్మిస్తే మరోవైపు నుంచి వచ్చే వరద నీరు కాలనీలోకి మళ్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.దీంతో సమీపంలోని ఇళ్లలోకి వరద నీరు చేరి ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగించడంతో పాటు కాలనీకి వరద ముప్పు లేకుండా ఉండాలంటే ఇరువైపులా కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు. గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ–రాజయ్య ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని రెండు వైపులా కల్వర్టుల నిర్మాణానికి కృషి చేస్తున్నప్పటికీ, అదనపు నిధుల కొరత అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అవసరమైన నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.ధర్మపురి ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా సాంకేతిక అంచనాలు రూపొందించి ఇరువైపులా కల్వర్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఒకవైపు కల్వర్టు నిర్మాణం తాత్కాలిక ఉపశమనమేనని, ఇరువైపులా నిర్మాణం చేపడితేనే ప్రజలకు భద్రతతో పాటు జంగ ఒర్రె సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు.

రామగుండంలో పైలాన్ కూల్చివేత

- భగ్గుమన్న గులాబీ శ్రేణులు
- 8 గంటల పాటు ధర్నా
- ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం
- మాజీ ఎమ్మెల్యే తో పాటు నాయకుల అరెస్ట్



గోదావరిఖని, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్ తొలగింపు రాజకీయ దుమారం రేపింది.మంగళవారం గోదావరిఖని గాంధీనగర్ లో అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన పైలాన్ ను రోడ్డు విస్తరణ పేరుతో జేసీబీ సహాయంతో తొలగించడంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పైలాన్ తొలగింపు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.నాయకులు కౌశిక హరి,వ్యాళ్ల హరీశ్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులతో కలిసి జేసీబీకి అడ్డంగా నిలబడ్డారు.ధర్నాకు దిగారు.పైలాన్ తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారుల తీరుపై చందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పైలాన్ తొలగింపునకు ఎవరు అనుమతిచ్చారని,ఏ ప్రాతిపదికన ఈ చర్యలు చేపట్టారని అధికారులను ప్రశ్నించారు.ఈ క్రమంలో పోలీసులతోనూ వాగ్వాదం చోటుచేసుకుంది.8గంటల పాటు ధర్నా కొనసాగించారు.నిరసనను మరింత ఉధృతం చేస్తూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పైలాన్ తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని,అభివృద్ధి పనులకు గుర్తుగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ గెలిచిన తర్వాత చిరు వ్యాపారుల దుకాణాలు,గుళ్లను కూల్చివేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ పార్కులు, ఇండస్ట్రియల్ పార్కులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించి ఏర్పాటు చేసిన పైలాన్ లను రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేసే ఆనవాళ్లను చెరిపివేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు.అనంతరం పోలీసులు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తో పాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి గోదావరిఖని పోలీస్ స్టేషన్ కు తరలించారు.దీంతో గాంధీనగర్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పైలాన్ తొలగింపు,మరోవైపు బీఆర్ఎస్ నాయకుల నిరసన,దిష్టిబొమ్మ దహనం,అరెస్టులతో రామగుండం రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన పైలాన్ తొలగింపు వ్యవహారం ఇప్పుడు అధికార,ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వివాదానికి కేంద్రబిందువుగా మారింది.



30 ఏళ్ల నాటి పశువుల నీటి తొట్టి ధ్వంసం గ్రామస్తుల ఆగ్రహం

- ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు తహసిల్దార్ కు ఫిర్యాదు

కోనరావుపేట, నవంబర్. 03(ప్రజాజ్యోతి) కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన పశువుల నీటి తొట్టిని కొందరు వ్యక్తులు ధ్వంసం చేయడంతో గ్రామంలో ఆగ్రహం వ్యక్తం అవుతుంది. గ్రామంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతున్న తొట్టిని ధ్వంసం చేయడంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో పశువులకు తాగునీరు అందించేందుకు గతంలో నిర్మించిన ఈ తొట్టిని కూల్చివేయడం వల్ల మూగజీవాలకు నీటి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు.ప్రజా అవసరాల కోసం నిర్మించిన సౌకర్యాలను ధ్వంసం చేయడం సమంజసం కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్. రవి కోనరావుపేట ఎస్ఐకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పశువుల నీటి తొట్టిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.సర్పంచ్ మిర్యాల్ కార్ బాలాజీ ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కు ఫిర్యాదు చేశారు.ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తొట్టిని పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ వెంట ఉపసర్పంచ్ వెలిశాల శ్రీనివాస్,తంగళపల్లి బుజ్జయ్య ఉన్నారు.



టీపీటీఎఫ్ బీర్ పూర్ మండల కమిటీ ఎన్నిక





బీర్ పూర్, నవంబర్ 3 (ప్రజా జ్యోతి): బీర్ పూర్ మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం సాయంత్రం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మండల సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు జి. మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె. ప్రకాశ్ వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం ఎన్నికల నిర్వాహకులు ఆర్. మహేష్, పరిశీలకులు కె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బీర్ పూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వి. గంగారాం, ప్రధాన కార్యదర్శిగా ఎమ్. విష్ణుప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చీర్నేని రవి, డి. శ్రీదేవి, ఎమ్. మధుకర్, ఆర్. జనార్ధన్, కార్యదర్శులుగా జి. సాయిరాం, ఎ. పద్మ, ఎన్. స్వప్న, జి. సుమన్, బి. శారదలు ఎన్నికవ్వగా, జిల్లా కౌన్సిలర్లుగా కడారి ప్రకాశ్, గొడుగు మధుసూదన్, ఆర్మూర్ భీమరాజు, ఎడ్ల గోవర్ధన్, గొడుగు రఘుపతి యాదవ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ, జిల్లా మరియు రాష్ట్ర కమిటీల సూచనల మేరకు నడుస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

చంద్రకళ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- బాధిత కుటుంబంలో ఒకరికి శాతవాహన యూనివర్సిటీలో ఉద్యోగం కల్పించాలి



ధర్మారం, నవంబర్3(ప్రజా జ్యోతి): కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎల్ఎల్బీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని చంద్రకళ నవంబర్ 1, 2026న మృతి చెందడం పట్ల బహుజన సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు.పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని చంద్రకళ మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని నాయకులు పేర్కొన్నారు.బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత యూనివర్సిటీ యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. కుటుంబానికి తక్షణమే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, కుటుంబంలోని ఒకరికి శాతవాహన యూనివర్సిటీలో ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా యూనివర్సిటీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి తగిన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.బి ఎస్ ఎస్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు జనగామ నరేష్, ధర్మారం మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షులు నెరువట్ల అభిలాష్, ఎండపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి, మోదుంపల్లి గంగయ్యతో పాటు బివిస్ ఎస్,ఎంఆర్పీఎస్,నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు జాదవ్ మృతి సమాజానికి తీరని లోటు

- ఆల్ మీడియా యునైటెడ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మొగురం రమేష్

కరీంనగర్, నవంబర్ 3(ప్రజాజ్యోతి) సామాజిక ఉద్యమకారుడు, జన గొంతుక ఎడిటర్ శ్రీనివాసరావు జాదవ్ మృతి జర్నలిస్టులతో పాటు, సమాజానికి తీరని లోటు అని ఆల్ మీడియా యునైటెడ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మొగురం రమేష్ అన్నారు. ఆయన మృతి పట్ల సంతాప వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జాదవ్ నిరంతరం సమాజంలో నెలకొన్న సమస్యల గురించి చర్చించే వారన్నారు. ఎప్పుడు ప్రశ్నించే వ్యక్తిగా అందరికీ కనిపించేవాడు. ఆయన మరణం ఉద్యమకారులను, జర్నలిస్టు లోకాన్ని కలిసి వేసింది.

కుక్కల దాడులతో కోరుట్ల ప్రజలు బెంబేలు..!

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిలర్ ఎం.ఏ. వసీం ఆగ్రహం
- చిన్నారిపై కుక్కల దాడి.. ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన కౌన్సిలర్లు
- సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తా వసీం హెచ్చరిక





కోరుట్ల, నవంబర్ 3 ప్రజాజ్యోతి:కోరుట్ల పట్టణంలో వీధి కుక్కల బెడద రోజు రోజుకూ పెరిగిపోతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రతిరోజూ ఏదో ఒకచోట కుక్కల దాడులు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది.తాజాగా కోరుట్ల పట్టణంలోని 32వ వార్డు వేములవాడ రోడ్డులోని ఓ కాంపౌండ్ నుంచి వచ్చిన వీధి కుక్కల గుంపు 21వ వార్డుకు చెందిన ఓ బాలుడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుక్కలు విచక్షణారహితంగా కరవడంతో బాలుడి శరీరమంతా గాయాలై రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు.అక్కడవైద్యులు బాలుడికి చికిత్స అందించారు.విషయం తెలుసుకున్న 32వ వార్డు కౌన్సిలర్ ఎం.ఏ. వసీం వెంటనే స్పందించి 18వ వార్డు కౌన్సిలర్ ఎం.ఏ. రహీం, 21వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. రిజ్వాన్ , జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ఏ. నయీమ్, మహమ్మద్ నాసిర్, మహమ్మద్ అమీర్ తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్,శానిటరీ ఇన్ స్పెక్టర్ అశోక్ కూడా ఆసుపత్రికి చేరుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఎం.ఏ. వసీం మాట్లాడుతూ.. కోరుట్ల పట్టణంలో వీధి కుక్కల దాడులు పెరుగుతున్న విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ప్రతిరోజూ కుక్కల దాడులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నా భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పట్టణంలోని వీధి కుక్కల సమస్యపై తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఇకనైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను నియంత్రించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతానని కౌన్సిలర్ ఎం.ఏ. వసీం హెచ్చరించారు. ప్రజల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.



కృష్ణారావు.. మీ స్థాయి ఏంటో తెలుసుకొని మాట్లాడండి

- కోరుట్ల అభివృద్ధిపై మాట్లాడే ముందు ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితులపై సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ నాయకుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నాయకులు..
- వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్



కోరుట్ల, నవంబర్ 3 ప్రజాజ్యోతి కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కోరుట్ల పట్టణ, మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

›» పదేళ్ల అభివృద్ధిని విస్మరించి మాట్లాడటం సరికాదు

గత పది సంవత్సరాలుగా కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తమవంతుగా కృషి చేశారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను విస్మరించి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని కృష్ణారావును ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ సేవలు పెరగడానికి తీసుకున్న చర్యలు, వైద్య సేవల మెరుగుదలకు చేసిన ప్రయత్నాలను గుర్తించకుండా విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.

›» ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై మీ సమాధానం ఏమిటి?

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ముందుగా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు.కేసీఆర్ కిట్ పథకాన్ని పక్కన పెట్టడం, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవడం, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాల కొరత వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తంచేశారు.ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని, సంబంధిత మంత్రులకు కూడా వివరించి ఆసుపత్రి అభివృద్ధికోసం విజ్ఞప్తులు చేసిన విషయాన్ని కృష్ణారావు గుర్తుంచుకోవాలని అన్నారు.

›» కోరుట్ల ప్రజలపై ఎందుకింత వివక్ష?

కోరుట్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులు, వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాలు అందించడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు.కోరుట్ల పట్టణం,నియోజకవర్గప్రజల ఆరోగ్య అవసరాల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందా? కక్షపూరితంగా వ్యవహరిస్తోందా? అని ప్రశ్నించారు. రాజకీయ విమర్శలు చేయడం కంటే ఆసుపత్రి అభివృద్ధికి కాంగ్రెస్ నాయకులు కూడా ముందుకు రావాలని హితవు పలికారు.

›» వార్డు మెంబర్‌గా కూడా గెలవని వ్యక్తి విమర్శలా?

స్థానిక ప్రజాప్రతినిధిగా కూడా ఎన్నికల్లో గెలవని కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రాజకీయ విమర్శలకు కూడా ఒక హద్దు ఉంటుందని, ప్రజలకు సంబంధించిన అంశాలపై మాట్లాడేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.కోరుట్ల అభివృద్ధి కోసం గతంలో ఎవరు ఏం చేశారు? ప్రస్తుతం ఎవరు ఏం చేస్తున్నారు? అన్న విషయాలను తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ పత్రికా విలేకరుల సమావేశంలో మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చీటీ వెంకటరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిచేటి రాజేష్, మాజీ మైనారిటీ అధ్యక్షుడు ఫహీం, కోరుట్ల పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు పొట్ట సురేందర్, వసీం, మహేష్, మోషన్, నరేష్, నత్తి రాజకుమార్, సజ్జు, నీలి శ్రీనివాస్, ఆంజనేయులు, అతీక్, యువ నాయకులు దొబ్బల వెంకటేష్, షేర్ అనిల్, దశరథం, అర్బజ్, మహేష్, అబూబకర్, అజ్మత్, నవీన్, అందె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురైన చిన్నారిని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

- చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం
- వీధి కుక్కల బెడద నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచన





కోరుట్ల, నవంబర్ 3 (ప్రజాజ్యోతి):కోరుట్ల పట్టణంలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతుండటంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.తాజాగా పట్టణంలోని 21వ వార్డు బిలాల్‌పూర్‌లో వీధిలో వెళ్తున్న ఆరేళ్ల చిన్నారిపై కుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై విషయం తెలుసుకున్నకోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యేడాక్టర్ సంజయ్ వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకుని కుక్క కాటుకు గురైన చిన్నారిని పరామర్శించారు.

›» చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అవసరమైన చికిత్సను అందించి చిన్నారి త్వరగా కోలుకునేలా చూడాలని ఆదేశించారు.

›» కుక్కల దాడులను అరికట్టాలి.. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

కోరుట్ల పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుండటంపై ఎమ్మెల్యే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని స్పష్టం చేశారు.వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యేడాక్టర్ సంజయ్ ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కుక్కల బెడద నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

›» ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 7 గంటలకే షుగర్ పరీక్షలు

అదేవిధంగా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మధుమేహ వ్యాధిగ్రస్తులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మరో కీలక సూచన చేశారు. ఉదయం 7 గంటల నుంచే షుగర్ వ్యాధిగ్రస్తులకు ఆహారం తీసుకునే ముందు రక్తంలో చక్కెర స్థాయిని పరీక్షించే సౌకర్యం కల్పించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. దీనివల్ల ఉదయం వేళ ఆసుపత్రికి వచ్చే మధుమేహ బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు 32వ వార్డు కౌన్సిలర్ ఎం.ఏ. వసీం, మహమ్మద్ మోసిన్, సురేందర్, మహేష్, నీలి శ్రీనివాస్, ఫహీమ్, అతీక్, సజ్జు, అబూబకర్ సిద్ధిఖీ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల,నవంబర్ 03 ప్రజాజ్యోతి కోరుట్ల పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ చిట్యాల లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ఈరోజు ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, రిజ్వాన్, మరిపెల్లి జనార్ధన్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

